17

# స్టీపెన్ స్పెండర్
## - హెన్రీ మిల్లర్

---

**రచన-సృజన !**

అంతకుముందు ఏమీ లేనిచోట, మామూలు దృష్టికి ఏమీ కనపడని చోట ఒక అద్భుతమైన చిత్రం, ఎద కదిలించే కవిత, మరపురానికథ- ఎలా పుట్టుకొస్తాయి?

రవి గాంచనిచో కవి ఎలా 'కాంచు' తున్నాడు? ఈ తెరవెనుక భాగవతం, సృజనాబృందావనిలో మనస్సనే కృష్ణుడు ఆలోచనల గోపికలతో ఆడే రాసలీలలను గమనించితే తరచి చూసే అతి రసవత్తరంగా వుంటుంది.

**అబ్బే ఏముందీ ?**

"అయ్యా! మీరు రచనలు ఎలాచేస్తారు?" అని విఖ్యాత తాత్వికుడు, నవలాకారుడు అయిన ఆల్డస్ హక్స్లీని అడిగితే ఆయన అన్నాడట!

"అబ్బే దానిదేముందండీ? బజారుకెళ్ళి ఒక దస్తా తెల్లకాగితాలు కొనుక్కొస్తాను. నాదగ్గర ఎటూ కలం వుంటుందికదా ... అంతే, మేజాదగ్గర కూచుని రాయడం మొదలెడతాను, రాసేస్తాను"

మరి హక్స్లీ హాస్యమాడాడా అంటే పూర్తిగా కాదనే చెప్పాలి.

మిమ్మల్ని ఎవరయినా "సైకిలు ఎలా తొక్కుతున్నారండీ?" అని గితే - "ఇదిగో, ఈ హేండిల్ బార్ని రెండు చేతులతోనూ పట్టుకుంటాను,

కుడికాలిని అటువైపుకువేసి ఫెడల్‌ని అందుకుంటాను. ఎడమ పాదంతో నేల నొక్కతాపు తంతాను. సైకిల్ కదులుతుంది-అంతే, ముందుకు తొక్కుకుంటూ వెళ్ళిపోతాను" అని వివరిస్తారు. అప్పుడు మీరు వేళాకోళం ఆడలేదు కానీ సైకిల్ తొక్కడం రానివాడికి మీరు వేళాకోళం చేస్తున్నట్లే అన్పిస్తుంది. కనుక నిజం ఎప్పటివలెనే పదాలకు అందీ అందనట్లుండిపోతుంది.

సుప్రసిద్ధ ఆంగ్లకవి, సాహితీ పత్రిక 'ఎన్‌కౌంటర్' వ్యవస్థాపకుడూ అయిన స్టీఫెన్ స్పెండర్ ఏమంటాడా చూద్దాం.

"కవికి స్పష్టమైన ఆలోచన, ఏకాగ్రత ఒకానొక లక్ష్యజ్ఞానం అన్నవి వర ప్రసాదంలాగ అబ్బవచ్చు. లేదా అతగాడు చాల గటిబిజిగా, నిదానంగా సృజించేవాడయి వుండవచ్చు. ఇందులో ఏరకం వాడయినా పరవా లేదుగాని, లక్ష్యశుద్ధి వుండితీరాలి. తన్ను తాను కోల్పోకుండా ఆ లక్ష్యసాధనలో నిమగ్నుడవ గలగాలి" అన్న స్పెండర్ నిర్వచనాన్ని అర్థం చేసుకుంటే బహుశ ఒకానొక లక్ష్యం వుండికూడా సమకాలీన కవులలో కొందరు తమ్ముతాము కోల్పోవడాన్ని మనం గమనించవచ్చు.

"కవితకు జ్ఞాపకశక్తి అవసరం కాని కవిత జ్ఞాపకశక్తిని, అనుభవాన్ని దాటి వెళ్ళగలగాలి. కొంతమంది ఉత్తరధృవం వెళ్ళడం గురించి, దారిలోపడిన బాధలతో సహా రాయగలరు. కాని నేను రాయలేను" అంటూ స్పెండర్-

"కవి విశ్వాసం అన్నది తెరమరుగున దాగిన సత్యంలాటిది. అతడు ఒకవిధమైన దిగంబరత్వాన్ని సాధించి, అసలైన తాను, తన ఆలోచనలు, ఊహాలు ఏవో,వాటితో ఒకటవాలి; చేతనయినంత సామర్థ్యాన్ని సంపాదించాలి; ఆ తర్వాత 'కాలం' యొక్క న్యాయపీఠంముందు నిలబడాలి. అంతే, అంతకన్న కవి చేయగల్గిందేమీ లేదు" అంటాడు.

కవిగా తన నమ్మకాలను, నిర్వచనాలను స్పెండర్ ఈ క్రింది వచన పద్యంలో ఇలా చెప్పాడు.

"నాకు శాంతినీ, శక్తినీ, భరోసానీ ఇవ్వు- ఎక్కడయితే ఆందోళన నన్ను నమిలితినదో- ఆ వెలుగునిండిన దినం, ఆ ఎత్తయిన కుర్చీ, ఆ నిరాడంబరమైన ఆధారం- నాదిగా చేయి. ఆ విధంగా జరగకపోతే, నక్కలూ తోడేళ్ళు నామీద కురుకుతాయి. అనుభవం నుంచి అనుభవానికి, ఒకచోటనుండి ఇంకొక చోటికి కాలు నిలువకుండా తిరిగే జంతువు నవుతాను నేను!

"నాసృజించే దానివలన కలిగే గంభీరమైన సంపూర్ణమైన సంతృప్తితో ఒంటరిగా కాపురంచేయగల విచక్షణను, వినయాన్ని నాకు ప్రసాదించు- ఎవరన్నా- దూషించినా, విమర్శించినా- అల్లల్లాడిపోని స్థిరత్వాన్ని నాకివ్వు.

చివరగా—అది ఆయన ప్రార్థన

"నువ్వు రాసింది, నువ్వుసృష్టించింది బాగుందా, లేదా అన్న మీమాంసతో బాధపడకు, అది నిండుగా, పరిపూర్ణంగావుందా, నువ్వు ప్రేమించే సువిశాల లోకానికి అది అద్దంపట్టిందా- అన్నది చూడు-"

—ఈ అనుభవం, ఆలోచించి రాసేవారందరికీ ఎరుకలోనిదే అయినా ఇంత చక్కగా చెప్పలేమేమో నన్పిస్తుంది.

ఇక రచయితల ప్రేరణల కారణాలు చూస్తే ఆశ్చర్యం గావుంటుంది.

తన మనస్సును లగ్నం చేయడానికి స్పెండర్ సిగరెట్లు విపరీతంగా కాలుస్తాడు. షిల్లర్ తన మేజా సొరుగులో కుళ్ళిన ఆపిల్ పండ్లనుంచుకునే వాడట. ఆ కంపు ముక్కుకు తగులుతుంటేగానీ రచనమీద అతడి మనసు నిలిచేదికాదు. వాల్టర్ డిలామేర్ కూడా సిగరెట్లు కాల్చేవాడు. ఆడెన్ (మన కృష్ణ మీనన్‌లా) లెక్కలేనన్ని 'టీ' లు తాగుతాడట. ఈ అలవాటు ఎందుయ్యా అంటే ఒకవైపు మనస్సును పూర్తిగా లగ్నం చేస్తున్నప్పుడు, దానిని భగ్నం చేసేటటువంటి చప్పుళ్లు, శక్తులు అనేకం వుంటాయి. వాటన్నిటికి ప్రతినిధిగా ఒకే ఒక అలవాటు (కుళ్ళిన ఆపిల్స్ వాసనో, సిగరెట్టు పొగో) వుంటే ఇతరత్రా కవి ఏకాగ్రతకే భంగమూ రాదు - అని స్పెండర్

వివరిస్తాడు, అప్సరసల ప్రయత్నాలను వమ్ముచేయడానికి తాపసి పెండ్లాడి నట్లన్నమాట! అంతేకాని టన్నులకొద్దీ 'టీ' గాని 'ఇంకొకటీ' గాని తాగినంత మాత్రాన కలంపట్టిన ప్రతివాడి నుంచీ రచన జాలువారదు.

'ట్రాపిక్ ఆఫ్ కేన్సర్'తో సుప్రసిద్ధుడయిన నవలాకారుడు హెన్రీ మిల్లర్ రచయితగా తన ఎదుగుదల గురించి చెప్పినది వటవృక్షాల నీడను పెరగ యత్నించే చిన్నారి మొక్కలన్నిటికీ చల్లటి హితవులా వుంటుంది.

"నేను మొదట మెచ్చుకున్న థామస్ మాన్, డాస్టోవస్కీ నియెట్జ్షె హేంపన్ మొదలయినవారి శైలిననుసరించాను కాని నాదంటూ ఒక శైలి ఏర్పడకపోయేసరికి నిరాశతో అపజయంతో కుంగిపోయాను. నేనెందుకూ కొరగానన్న అగాధంలోకి పడిపోయాను. అక్కడినించే నా పునర్జన్మ మొదలయింది. నాకు తెలిసిన వాటిని, నేను మెచ్చినవారిని దూరంగా విసిరి పారేశాను. ''అ ఆ''ల దగ్గరనుంచీ మొదలు పెట్టాను. వంకరలుండవచ్చును గాక, వణుకులూ వక్రస్వరాలూ వుండవచ్చునుగాక, అది నా స్వంత గొంతు! నా స్వంత గొంతు పలుకువిని ఆనందంతో ఎగిరి గంతేశాను. నేను నేన య్యాను'' అంటాడు మిల్లర్. రచనా వ్యాసంగంలో అడుగిడే వారందరికీ ఇది పెద్ద నీతి.

జీవితం— రచయితల సంబంధం ఎలా ఉండాలో వివరిస్తూ హెన్రీ మిల్లర్- "పైపైన అధికారంపేరిట, ఆస్తి పేరిట ఘోరయుద్ధాలు జరుగు తుంటాయి. అసలు ఇసుకవేస్తే రాలనంత క్రిక్కిరిసి వుంటుంది జీవితం. అంచేత కాస్త క్రిందికి, లోతుకు, లోపలికి పునాదుల వైపుకు జారితే తప్ప ఏదీ అర్థంకాదు. పోటీలకు పోట్లాటలకూ దూరం అయి వేళ్ళదగ్గరకు వెళ్ళి నప్పుడే రచయిత రచనా జీవితం, అతగాడి రెండో పుట్టుక మొదలవుతుంది. నేనిప్పుడు, రాసినప్పుడెంత ఆనందంగా వుంటానో. రాయనప్పుడూ అంత ఆనందంగా వుంటాను. మాగిన పండ్లను చెట్టుకుమల్లే, నా రచనా ఫలాలను అందిస్తుంటాను" అన్నాడు. రచనలో పరిపక్వత కిది చక్కటి దృష్టాంతం;

అందుకనే కాబోలు ఇంకొక సందర్భంలో టి. హెచ్. హక్స్లీ– "వాస్తవాన్ని దాటి వెళ్ళలేని వాడు వాస్తవం దగ్గరకు కూడా వెళ్ళలేడు" అంటాడు-!. "సమకాలీన వాస్తవం" "సమాజం", "చైతన్యం' అని వల్లించే వారికి ఈ హెచ్చరిక బాగా వర్తిస్తుందేమో! ఆధునిక విజ్ఞాశాస్త్రంలో హిమవన్నగమయిన ఐన్‌స్టయిన్ అన్నమాట ఇంకా ఆశ్చర్యం కల్గిస్తుంది– "వాస్తవాలు ఒప్పులు కావు!" అన్నాడాయన! వాస్తవాలనేవాటి పైరూపం చూచి నిర్ణయాలకు రావడం, చొక్కానుబట్టి మనిషిని అంచనా వేయడంలాటిది అని చెప్పడమే ఐన్‌స్టిన్ ధ్యేయం. జీవితపు ఉపరితలాన్ని వీడి, అడుగుకు వెళ్ళాలని మిల్లర్ చెబుతున్నది ఇదే, ఇదే!

ఇంక శైలి గురించి హెన్రీ మిల్లర్, "భాషంటే పదాల సముదాయం కాదు. పదాలన్నిటికన్న ఎక్కువ భావం అందించగలదే భాష. అంచేత భాషమీదే నమ్మకం, పదాలమీద కాదు. పదాలనేవి మృతప్రాయాలు, పండితులు, శబ్దోత్పత్తి శాస్త్రజ్ఞులు, భాషా వేత్తలూ లాంటి వారి మనసుల్లో తప్ప పదాలు విడిగా ఎక్కడా వుండవు. ప్రతీ రచయితా అతడి శైలి ద్వారా కనబడతాడు. అతడి హృదయం స్పటికంవలె వుంటే అతడికి అర్థం కానిది ఏమీ వుండదు అటువంటి వాడికి ఒకానొక రహస్యం, ఒక మార్మికత పరిచయం అవుతుంది. అది నిజంగా అర్థంకాని రహస్యంకాదు అది క్రమ బద్ధమైనది; సహజమైనది; శిరోధార్యమైనది. రచయిత దానిని ఛేదించడం ఖాక దానితోబాటు 'ప్రవహించడం' నేర్చుకోవాలి.... కళ జీవితపు ప్రాముఖ్యాన్ని తెలుపుతుంది. గొప్ప రచన ఏదయినా అర్థమయీ, కానట్లుంటుంది. నేను 'విప్లవవాదిని' అన్నారు. కాని నిజానికి నేను రెండువైపులకూ అతీతంగా వుండి, నా రచనలో వాటి సమతూకాన్ని చూపుతాను- తెగించనిదే జీవితపు లోతులు రచయితకు దొరకవు. తెగించి అగాధంలోకి దూకితే తనకు తానై తేలడం నేర్చుకుంటాడు. అదే అతడి శైలి, రచన, జీవితం! అలాటి సాహసాల సంపుటమే మానవ జీవితపురోగతి చరిత్ర!"– అన్న మిల్లర్ 'మన' వారిలో ఒకడుగా అన్పిస్తాడు. మన 'చలా' న్ని అర్థంచేసుకోవడానికీ సూత్రం బాగా తోడ్పడుతుందేమో!

–ఇవన్నీ చూడగా చూడగా 'సత్యం ఒక్కటే! కాని జ్ఞానులు దానిని అనేకవిధాల వర్ణిస్తారు' అన్న సూక్తే గుర్తుకొస్తుంది.